క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పద్మాక్షికాలనీ, శివ ముక్తిధామ్, రాజ్‌పుత్‌వాడ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

టీబీఈఎస్ఎస్ జిల్లా కమిటీ పదవీ కాలం పొడిగింపు

కాశోజీ సెంటర్: తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘ్ వరంగల్ జిల్లా కమిటీ పదవీ కాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పీపీ రాథోడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుల సీరాం ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా అధ్యక్షుడు లావుడ్య సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా లావుడ్య సునీల్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా హట్కార్ తిరుపతి, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా భూక్య రవికుమార్, జిల్లా కోశాధికారిగా భూక్య రవీందర్ నాయక్ అదే పదవుల్లో కొనసాగనున్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో కేయూకు చోటు


కిరణ్


సతీష్


హరికృష్ణ


పూజ

కేయూ క్యాంపస్: సిద్దిపేటలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ సభల్లో నూతన కమిటీని ఎన్నుకోగా, అందులో కేయూ నుంచి పలువురికి చోటు లభించింది. ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా కాకతీయ యూనివర్సిటీలోని మ్యాథ్‌మెటిక్స్ విభాగంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థి అంబాల కిరణ్, స్టేట్ యూనివర్సిటీస్ కోకన్వీనర్‌గా పొలిటికల్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థి చట్ల సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఉప్పటి హరికృష్ణ (ఎకనామిక్స్‌విభాగం), పసుపులేటి పూజ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) ఎన్నికయ్యారు.

నేడు స్పెషల్ గ్రీవెన్స్

కాశోజీ సెంటర్: వరంగల్ జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.రాజమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు స్పెషల్ గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్యాంక్‌బండ్‌పై సదాలక్ష్మి విగ్రహం పెట్టాలి

దేశాయిపేట: మాదిగ హక్కుల పోరాట ఉక్కు మహిళ, మాజీ మంత్రి సదాలక్ష్మమ్మ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ట్యానరీ లెదర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తూరి యాకేందర్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు దేశాయిపేటలోని ఎస్ఆర్‌భవన్‌లో సదాలక్ష్మి జయంతి సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటి ఆది జాంబవ్వ అరుంధతి ఫెడరేషన్ ద్వారా అలాగే, లిడ్ క్యాప్, మాదిగల హక్కుల కోసం పోరాడిన ఉక్కు మహిళ సదాలక్ష్మి అని కొనియాడారు. తొలి మహిళా డిప్యూటీ స్పీకర్‌గా దేవాదాయ, సోషల్ వెల్ఫేర్ శాఖలను సమర్థవంతంగా నిర్వహించిన మొదటి మహిళగా గుర్తింపు పొందారని గుర్తుచేశారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు జన్ను సుశీరాజ్, మహ్మద్ సిద్దిక్ అహ్మద్, జేఈ.ప్రసాద్, అశోక్, మహిళలు పాల్గొన్నారు.

గోలి సోడాకు తగ్గని క్రేజ్


సోడా కొడుతున్న చిరు వ్యాపారి

కాజీపేట: కొన్నేళ్ల క్రితం సోడాలంటే గోలి సోడాలే. ఎండా కాలం వచ్చిందంటే గుర్తుకు వచ్చేవి అవే. ఇప్పటి పిల్లలకు ఈ సోడాల గురించి తెలియకపోవచ్చు. అయితే పది, పదిహేనేళ్ల క్రితం వరకు గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా ప్రతీచోట గోలి సోడాలు కనిపించేవి. నేడు ఇప్పుడిప్పుడే ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నచందంగా ఉన్నత కుటుంబాల ఫంక్షన్లలో గోలి సోడాలను ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీంతో పాటు ఇటీవల కాలంలో అక్కడక్కడా బండ్లు, కూల్ డ్రింక్స్ దుకాణాల్లో గోలి సోడాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్‌లో ఒకనాడు సాధారణ సోడా రూ.3, నిమ్మ సోడా రూ.5ధర పలికేది. నేడు రూ.10 నుంచి రూ.15 వరకు అమ్ముతున్నారు. అప్పుడూ ఇప్పుడూ గోలి సోడాకు గిరాకీ ఏమాత్రం తగ్గలేదని వ్యాపారులు చెబుతున్నారు.

కానరాని పారిశుద్ధ్యం

- అరకొరగా పనులు చేస్తున్నా పట్టించుకోని అధికారులు
- బురదమయంగా మార్కెట్ పరిసరాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులు


కూరగాయల మార్కెట్‌లో బురదతో ఉన్న రోడ్డు


మార్కెట్ ఆవరణలో చిత్తడిగా మారిన రోడ్డు


రోడ్డుపై పేరుకుపోయిన బురద

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్‌లో పారిశుద్ధ్య పనులు కంటి కానరావడం లేదు. గురువారం కురిసిన వర్షానికి మార్కెట్‌లో రోడ్లు, ఆవరణం బురదమయంగా ఉండడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఫిర్యాదు చేసినా పట్టించుకునే అధికారి, సిబ్బంది లేరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జేడీఎం, డీడీఎం, డీఎంల కార్యాలయాలు ఉన్నా, ఆఫీస్ కాంప్లెక్స్ ముందు మార్కెట్ ఉన్నా ఏ రోజూ అధికారులు దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. పారిశుద్ధ్య పనులు టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారా లేదా అన్న విషయాలను మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలా అస్తవ్యస్తంగా తయారైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చినుకు పడితే బురదమయం

చిన్న చినుకు పడితే చాలు మార్కెట్ ఆవరణ మొత్తం బురదమయంగా తయారవుతోంది. రోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో కూరగాయలతో వచ్చిన మట్టి పేరుకుపోయి అధ్వానంగా తయారవుతోందని వ్యాపారులు అంటున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టకున్నా ప్రతి రోజు సంబంధిత కాంట్రాక్టర్.. వాట్సప్ గ్రూపుల్లో ఫొటోలను మార్కెట్ అధికారులకు పంపిస్తుండడంతో వారు నెలవారీగా బిల్లులు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఒకే రోజు వివిధ కోణాల్లో తీసిన ఫొటోలను అధికారులకు పంపిస్తూ కాంట్రాక్టర్ బిల్లులు పొందుతున్నట్లు తెలుస్తోంది. దీనంతటికి అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే అని తెలుస్తోంది.

వ్యాపారులూ బాధ్యులే..

లక్ష్మీపురం మార్కెట్‌లో వ్యాపారులపై మార్కెట్ అధికారుల పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడం వల్ల మురిగిన, చెడిపోయిన కూరగాయలను ఎక్కడ పడితే అక్కడ పోస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీనికి తోడు వర్షపు చినుకులు పడడంతో మార్కెట్ పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. మార్కెట్ గుర్తింపు పొందిన వ్యాపారులు ఎవరు, ఎక్కడ అమ్మకాలు చేస్తున్నారన్న విషయం తెలియకుండా పోయింది. గుర్తింపు కార్డులు ఇస్తామని కలెక్టర్‌తో సహా మార్కెటింగ్ అధికారులు ప్రకటనలు చేసినా నేటికీ అమలుకు నోచుకోలేదు. బినామీలను ఏరివేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నా.. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఈ ప్రక్రియ పడకేసినట్లు తెలుస్తోంది. రోజురోజుకు పుట్టుకొస్తున్న చిల్లర వ్యాపారులను కట్టడి చేయాలనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆర్థికాభివృద్ధి మార్గదర్శకుడు మన్మోహన్

- చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి


సంతాప సభలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

వరంగల్: భారతదేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, ఆద్యుడు, మితభాషి, అజాత శత్రువు, మేధావి, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరమని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. మన్మోహన్‌సింగ్ సంతాపసభను వరంగల్ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ దేశ ఆర్థిక నిపుణుడిగా, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా పనిచేసి ఆ తర్వాత దేశ ఆర్థిక మంత్రిగా సేవలందించారని కొనియాడారు. దేశ ఆర్థికస్థితి అయోమయంలో ఉన్నప్పుడు అపర చాణిక్యుడిగా ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని మాంద్యం పరిస్థితి నుంచి గట్టెక్కించారని గుర్తుచేశారు. ప్రధానమంత్రిగా పనిచేసిన కాలంలో బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉపాధిహామీ లాంటి అనేక పథకాలను తీసుకొచ్చారని అన్నారు. మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, చాంబర్ ప్రతినిధులు సాగర్ల శ్రీనివాస్, అల్లె సంపత్, కార్యవర్గ సభ్యులు, వివిధ సెక్షన్ల అధ్యక్ష కార్యదర్శులు, గుమస్తా, దడువాయి, వివిధ హమాలి కార్మిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి



జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల బాధ్యులు, న్యాయవాదులు


మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు


మడికొండ చౌరస్తాలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు


కాజీపేట చౌరస్తాలో మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కడిపికొండలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోరాటాన్ని పదునెక్కిస్తేనే సమస్యలకు పరిష్కారం

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్


మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

విద్యారణ్యపురి: సమగ్రశిక్ష ఉద్యోగుల్లో చాలామంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బలహీన వర్గాలవారేనని, ఈక్రమంలో దీక్షలు చేస్తూ ఒకచోట కూర్చుంటే సమస్యలు పరిష్కారం కావని, రోడ్డెక్కి నిరసనలతో ఉద్యమించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ సూచించారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, పేస్కేల్ వర్తింపజేయాలనే పలు డిమాండ్లతో హనుమకొండ, వరంగల్ జిల్లాల సమగ్రశిక్ష ఉద్యోగులు ఏకశిల పార్కు వద్ద చేపట్టిన సమ్మె శుక్రవారం 22వ రోజుకు చేరుకుంది. దీక్షలకు విశారదన్ మహరాజ్ సంఘీభావం తెలిపి మాట్లాడుతూ తాను కేవలం మద్దతు తెలిపేందుకే రాలేదని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యుద్ధం చేసేందుకు వచ్చానని అన్నారు. పోరాట పంథాను పదునెక్కించి పోరాడాలని పిలుపునిచ్చారు. శిబిరంలో ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎండీ.షఫీ, తదితరులు పాల్గొన్నారు.

పూర్ణ పుష్కలాంబ సమేత అయ్యప్ప కల్యాణం


కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న అర్చకులు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని అయ్యప్పస్వామి కల్యాణ వేడుకలను పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూర్ణపుష్కలాంబ సమేత అయ్యప్పకు కల్యాణ వేడుకలు జరిపించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారులు భారీగా తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. యల్లంబట్ల క్రాంతికుమార్ శర్మ, జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు వెంకటేశ్వర్లు శర్మ, సాయికృష్ణశర్మతో పాటు గురుస్వాములు పూజలు చేశారు.

నేడు కేయూలో జాతీయ సెమినార్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజగోవింద్, తదితరులు

నయీంనగర్: యునైటెడ్ నేషన్స్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అనే అంశంపై కాకతీయ యునివర్సిటీ సెనెట్ హాల్‌లో శనివారం ఉదయం జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు యూఎన్ రిసోర్స్ సెంటర్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ధర్మపురి రాజగోవింద్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సెమినార్‌లో ప్రపంచ దేశాల సుస్థిర అభివృద్ధి, వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఉంటుందని అన్నారు. పేదరిక నిర్మూలన, భూ పరిరక్షణ, శాంతి, మానవాళి సర్వతోముఖాభివృద్ధి, విశ్వవిద్యార్థులకు పలు అంశాలపై నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ సెమినార్ దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా యోగేశ్ కుల్‌శ్రేష్ఠ, డాక్టర్ అశ్వినిశర్మ, గోస్వామి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో మండల పరశురాములు, పొనగోటి అశోక్, గోసికొండ సుధాకర్, కామేశ్వర్‌రావు, బాల్నె రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారులు

- అరగంటలో తల్లిదండ్రులకు అప్పగింత



హసన్‌పర్తి: ఇద్దరు చిన్నారులు తప్పిపోయారని తల్లిదండ్రులు 100నంబర్‌కు డయల్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆ చిన్నారులను 30 నిమిషాల్లో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదర్శ కాలనీకి చెందిన కాల్వచర్ల మల్లికార్జునచారి కుమారుడు కాల్వచర్ల అశ్వంత్ (9)తో పాటు అదే ప్రాంతానికి చెందిన కందికొండ లక్ష్యా(4) కలిసి శుక్రవారం సాయంత్రం 6గంటలకు ఆడుకునేందుకు బయటికి వెళ్లారు. చాలాసేపు అయినా ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో 100కు డయల్ చేశారు. అలర్ట్ అయిన పోలీసులు చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టారు. ఆ ఇద్దరు పక్క వీధిలో ఉన్నట్లు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ చిన్న పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు.

సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


హసన్‌పర్తి: రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు


యాస్మిన్


శ్రీవాణి

హసన్‌పర్తి: సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు పలువురు విద్యార్థులు అర్హత సాధించారు. ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు నగరంలోని జేఎన్ఎస్ మైదానంలో జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో హసన్‌పర్తి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన శీలం సుష్మిత, వై.నక్షత్ర, ఎల్.రామ్‌చరణ్, పి.వరుణ్, సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన అద్విత్ గౌడ్, అభిలాష్, ఎన్.గుణ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ శీలం పార్థసారథి తెలిపారు. ఈనెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కోచ్ నరేందర్, ఉద్యోగుల సంఘం హసన్‌పర్తి అధ్యక్షుడు శీలం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆరెపల్లి విద్యార్థుల ప్రతిభ

వరంగల్: ఈనెల 28నుంచి 31వ తేదీ వరకు మెదక్ జిల్లాలో జరగనున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆరెపల్లి జెడ్పీ ఎస్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్కే.యాస్మిన్, బి.శ్రీవాణి ఎంపికైనట్లు హెచ్ఎం టి.వెంకన్న, పీడీ పూజారి అశోక్‌బాబు తెలిపారు. ఇటీవల వరంగల్ చింతల్ మైదానంలో జరిగిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో వారు పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఈమేరకు ఆ విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానికులు శుక్రవారం అభినందించారు.

పెన్షనర్లు, ఉద్యోగులకు హెల్త్‌కార్డులు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

దేశాయిపేట: మార్కెట్ కమిటీల పరిధిలోని పెన్షనర్లు, ఉద్యోగులకు ఈహెచ్ఎస్ (ఎంప్లాయ్‌మెంట్ హెల్త్ స్కీం)లో భాగంగా హెల్త్ కార్డులను ప్రభుత్వం అందించాలని మార్కెట్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నాగపురి సారయ్య కోరారు. అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు కర్రు సుధీర్‌బాబు అధ్యక్షతన దేశాయిపేట రోడ్డులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయి ఉన్న 4 డీఏలను విడుదల చేస్తూ 2వ పీఆర్‌సీ అమలు చేసేందుకు పెన్షనర్స్ జేఏసీ దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన పెన్షనర్లను సన్మానించి, 2025వ సంవత్సర డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి ఎంవీ.నర్సింగరావు, నర్సింహారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, డీటీఓ విజయసారధి, ఉపాధ్యక్షులు రామమనోహర్, వెంకటేశ్వర్లు, అశోక్, జగన్, రాంకిషన్, దక్షిణమూర్తి, బియాబాని, సాంబరెడ్డి, పి.వీరన్న, లక్ష్మీనారాయణ, సారంగపాణి, జె.కొమురయ్య, బి.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి, రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న డీబీఎఫ్ నాయకులు

- డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్

హన్మకొండ: భూమిలేని ఉపాధి హామీ, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇవ్వాలని, అందుకు సంబంధించిన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో భూమి లేని ఉపాధి హామీ, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. భూమిలేని, ఎకరంలోపు భూమి ఉన్న కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని, ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పూర్తి చేసిన వారికే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని 53 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డుల్లో ఉన్న 1.10 కోట్ల కూలీలందరికీ అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, నాయకులు పోలెపాక మల్లేషం, రాము, రమేష్, రవి, సిద్ధార్థ, శివ, మహేందర్, కృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం


రాజేష్ మృతదేహం

వరంగల్: నగరంలోని కాశిబుగ్గ పద్మనగర్‌కు చెందిన నామని రాజేష్ (26) గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లోని వాసానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం కిరాణ షాపులో రాజేష్ గుమస్తాగా పనిచేస్తుండేవాడు. అతడికి చిన్నతనం నుంచి మూర్ఛ రోగం (ఫిట్స్)తో బాధపడుతున్నాడు. తండ్రి రాజేష్ చిన్న వయసులోనే చనిపోవడం అతని అనారోగ్య సమస్య వల్ల వివాహం కాలేదు. దాంతో నిత్యం రాజేష్ తనలో తాను బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. మృతుడి తల్లి నామని భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయంలో అనఘాష్టమి వ్రతం


అనఘాష్టమి వ్రతంలో పాల్గొన్న భక్తులు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవాలయంలో శుక్రవారం రాత్రి సామూహిక అనఘాష్టమి వ్రతం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

భద్రకాళి రోడ్డులో..

భద్రకాళి రోడ్డులోని అయ్యప్ప దేవాలయంలో అర్చకుడు గణపతిశర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కమ్యూనిస్టుల పునరేకీకరణ తక్షణవసరం



వేయి స్తంభాల గుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు ప్రదర్శనగా వెళ్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు
- నగరంలో పార్టీ శత వసంతాల భారీ ప్రదర్శన

హన్మకొండ చౌరస్తా: దేశంలో కమ్యూనిస్టుల పునరేకీకరణ తక్షణవసరమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 100వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని వేయిస్తంభాలగుడి నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడారు. త్యాగాల పునాదులు, పోరాటాల చరిత్ర సీపీఐది అని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఓట్లు, సీట్లు ఎత్తుల చిత్తుల ప్రలోభాలకు లొంగకుండా పోరాడుతున్నది సీపీఐ మాత్రమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకుడు మోతె లింగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేట బస్టాప్ ప్రాంతంలోని మొదటి వీధిలో నివాసముంటున్న తమకు వీధి దీపాలు, సైడ్ డ్రెయినేజీలు, రోడ్డుతో కూడిన మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరారు. ఈమేరకు కార్పొరేటర్ మామిండ్ల రాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీధర్, మధు, త్యాగరాజు, ఫాతిమా, రాజమణి, సరోజన తదితరులు పాల్గొన్నారు.